# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

మంగళవారం | 14 అక్టోబరు, 2025 | పేజీలు :08


## మంత్రి శ్రీధర్ బాబుని కలసిన సంపత్



**ప్రజాపక్షం/ముత్తారం :** తెలంగాణ రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు ని సోమవారం పారుపల్లి మాజీ సర్పంచ్ చొప్పరి సంపత్ మర్యాద పూర్వకంగా కలిసి గత పది సంవత్సరాలుగా పార్టీ కోసం కష్టపడుతూ క్రమశిక్షణ తో ఉంటూ గత స్థానిక సంస్థల ఎన్నికల్లో స్వల్ప మెజారిటీతో జెడ్పీటీసీ గా ఓడిపోయిన శ్రీధర్ బాబు సహకారంతో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాను.గతంలో పారుపల్లి సర్పంచ్ గా కూడా పని చేసిన అనుభవం వుంది. రిజర్వేషన్ అనుకూలత ఉండటంతో మరోసారి తనకు జెడ్పీటీసీ గా అవకాశం కల్పించాలని మంత్రి కి సంపత్ విజ్ఞప్తి చేశారు.

### నల్ల బంగారు నేలపై విరబూసిన
# ఎర్రని మందారం గుండా మల్లేష్




**ప్రజాపక్షం/పెద్దపల్లి :** అలుపెరుగని పోరాట యోధుడు పేదల పెన్నిధి కమ్యూనిస్టు అగ్రనేత కామ్రేడ్ గుండా మల్లేష్ 5వ వర్ధంతి సందర్భంగా గోదావరిఖని భాస్కర్ భవన్ లో సోమవారం సిపిఐ నగర సమితి, ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ గోసిక మోహన్, కామ్రేడ్ గౌతం గోవర్ధన్, ఆర్జీ వన్ బ్రాంచి సహాయ కార్యదర్శి కామ్రేడ్ రంగు శ్రీనివాస్ ముందుగా గుండా మల్లేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కామ్రేడ్ గోసిక మోహన్, కామ్రేడ్ గౌతం గోవర్ధన్ లతో కలిసి సిపిఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే.కనక రాజ్ మాట్లాడుతూ కామ్రేడ్ గుండా మల్లేష్ నిరుపేద కుటుంబంలో జన్మించి 1966లో సిపిఐ పార్టీలో చేరి అనేక కార్మిక కర్షక యువజన పోరాటాల నిర్వహించి అంచలంచెలుగా ఎదిగి సిపిఐ శాసనసభ్యులుగా నాలుగుసార్లు గెలిచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీలో తన గళాన్ని వినిపించారని అన్నారు.1983లో తెలుగుదేశం పార్టీ ప్రభంజంలో సైతం అసిఫాబాద్ నుండి సిపిఐ ఎమ్మెల్యేగా గెలిచాడని వారు తెలిపారు. మూడుసార్లు ఆసిఫాబాద్ నుండి ఒకసారి బెల్లంపల్లి నుండి శాసనసభ్యునిగా ఎన్నికై సిపిఐ పక్ష నాయకునిగా పనిచేశారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్రం కావాలని గొంతెత్తి నినదించి శ్రీకృష్ణ కమిటీ ముందు ప్రత్యేక తెలంగాణ ఇవ్వాల్సిందేనని కమ్యూనిస్టు పార్టీ తరఫున నివేదికను సమర్పించి ఢిల్లీకి వెళ్లి తన వాదనలను గట్టిగా వినిపించాడని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యిందంటే కామ్రేడ్ గుండా మల్లేష్ అన్న కృషి పట్టుదల వల్ల కమ్యూనిస్టు పార్టీ పోరాటం వల్లనేనని వారన్నారు.దళితుల అభ్యున్నతి కోసం దళిత హక్కుల పోరాట సమితి నీ ఏర్పాటు చేసి జాతీయ స్థాయిలో దళితుల పట్ల జరుగుతున్న అణిచివేతకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు.అజాత శత్రువుగా,నిరుపేదల పెన్నిధిగా నియోజకవర్గ ప్రజల ఆప్తమిత్రునిగా ప్రతి ఒక్కరిని కుటుంబ సభ్యులు గా ఆదరించే మంచి మనసున్న మల్లేషన్న ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని, వారు చేసిన త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేస్తూ పార్టీని ప్రజా సంఘాలను బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మడికొండ ఓదేమ్మ, ఏ ఐ వై ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మార్కాపురి సూర్య, జిల్లా సమితి సభ్యులు మాటే టి శంకర్, టి . రమేష్ కుమార్,నాయకులు పడా ల కనక రాజ్,గండి ప్రసాద్, వెంకట రెడ్డి, ప్రభుదాస్, మా మానాల శ్రీనివాస్ ,జగన్ ,ఆసాల నవీన్,సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

## చాగంటి ప్రవచన కార్యక్రమం విజయవంతం



**ప్రజాపక్షం/ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి పుణ్య క్షేత్రంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే రెండురోజుల పాటు నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం రాత్రి ఘనంగా, విజయవంతంగా ముగిసింది. శని,ఆదివారం రెండురోజుల పాటు కొనసాగిన ఈ ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమానికి వివిధ ప్రాంతాలనుండి భక్తులు భారీగా హాజరయ్యారు.చివరిరోజు ఆదివారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆహ్వానం మేరకు ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి,సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి,జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్ కుమార్,బాచంపెల్లి సంతోష్ కుమార్ శాస్త్రి తదితరులు హాజరయ్యారు. ప్రతీ ఒక్కరూ భక్తి మార్గాన్ని ఆచరించాలని ఆధ్యాత్మిక ద్వారానే ఆత్మ సంతృప్తి కలుగుతుందని చాగంటి కోటేశ్వరరావు తెలిపారు.దక్షిణాభిముఖంగా ప్రవహిస్తున్న గోదావరి నదీ తీర్థ క్షేత్రం,బ్రహ్మ,విష్ణు, లక్ష్మీ నృసింహుడు కొలువైఉన్న ధర్మపురి గొప్ప పుణ్యక్షేత్రమని చెప్పారు. ధర్మాన్ని పాటించే ప్రతీ ఒక్కరికీ ఆ భగవంతుని అనుగ్రహం ఉంటుందని ప్రవచనములలో చాగంటి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ధర్మపురి క్షేత్రంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని దీనిలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కృషి గొప్పదని అన్నారు.నవనారసింహ క్షేత్రాలలో ఒక్కటైన ధర్మపురి పుణ్యక్షేత్రం విశిష్టత ను పలు వేదికలపై ఇప్పటికే చాగంటి వివరించారని తెలిపారు. సమాజంలో నీతి నిజాయితీ సేవాభావం పెంపొందించుకోవాలని శ్రీధర్ బాబు పేర్కొన్నారు.కార్యక్రమం విజయవంతం పట్ల కృతజ్ఞతలు*రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆహ్వానం మేరకు ధర్మపురి పుణ్యక్షేత్రం లో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చే రెండురోజుల పాటు నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం విజయవంతం అయ్యాయని దీనికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, ట్రస్టుబోర్డు అధ్యక్షులు జక్కు రవీందర్ లు పేర్కొన్నారు.

### ఇందిరమ్మ ఇల్లు కోసం నిర్మల్ కలెక్టరేట్‌లో
# మహిళ ఆత్మహత్యాయత్నం కలకలం




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:** ఇందిరమ్మ ఇంటి మజూరులో జాప్యం జరగడంతో మనస్తాపం చెందిన ఓ మహిళ నిర్మల్ జిల్లా కలెక్టరేట్ భవనం పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం సోమవారం నాడు తీవ్ర కలకలం రేపింది.బైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన బాధితురాలు కలెక్టరేట్‌కు చేరుకుని,తమకు న్యాయం చేయాలని,ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ,లేదంటే భవనం పైనుంచి దూకి చనిపోతానని అధికారులను హెచ్చరించి పైకెక్కింది.

**బ్లేడుతో చేయి కోసుకున్న బాధితురాలు...**

ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకుని చాలా రోజులు గడుస్తున్నా అధికారులు మంజూరు చేయలేదని,గత ప్రభుత్వం హయంలో డబుల్ బెడ్ రూమ్ కోసం దరఖాస్తు చేసుకున్నా అన్యాయమే జరిగిందని మహిళ ఆవేదన వ్యక్తం చేసింది.ఏడు నెలలుగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగకపోవడం వల్లే ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిసింది.సమాచారం అందుకున్న పోలీసులు,అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని మహిళతో ఫోన్‌లో సంభాషణ జరిపారు.న్యాయం జరిగేలా చూస్తామని ధైర్యం చెప్పడంతో ఆమె కిందికి దిగేందుకు సిద్ధమైంది.అయితే,స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో మళ్లీ మొండికేసిన ఆమె బ్లేడుతో తన చేతిని కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది.



**జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశం...**

వెంటనే స్పందించిన సిబ్బంది 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా,ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ సంఘటనను సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్,దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని,బాధ్యత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని సూచించారు.భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని,సామాన్య ప్రజలకు ముందుగా న్యాయం జరిగే విధంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

# చందా ఆసుపత్రిలో అతి తక్కువ ప్యాకేజీలో మెదడు, వెన్నెముక ఆపరేషన్లు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:** సమాజం పట్ల బాధ్యతగా అందరికీ అందుబాటు ధరల్లో ఉత్తమ వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చందా న్యూరో అండ్ ట్రామా కేర్ సెంటర్ చైర్మన్, ప్రముఖ న్యూరో సర్జన్ డా.సిహెచ్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. సోమవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చందా న్యూరో ట్రామా కేర్ సెంటర్‌లో ఆరో వార్షికోత్సవం సంధర్బంగా రోగులకు అతి తక్కువ ధరలకే వైద్య సేవలు అందించనున్నట్లు ప్రకటించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ నెల 14 నుంచి అక్టోబర్ 31 వరకు ప్రత్యేక ప్యాకేజీలను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ ప్యాకేజీలో భాగంగా రూ.2 లక్షల విలువైన వెన్నెముక శస్త్రచికిత్సను కేవలం రూ.66,666కే, కేవలం లక్ష రూపాయలకే మెదడు శస్త్రచికిత్సను నిర్వహించనున్నట్లు వివరించారు. రోగులకు పలు ప్రత్యేక ప్యాకేజీలు ఉన్నట్లు తెలిపారు. న్యూరో సేవలు జనరల ఫిజీషియన్ సేవల్లో ప్యాకేజీలు ఉన్నాయని చెప్పారు. ఉత్తర తెలంగాణ ప్రజలు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పేద విద్యార్థులకు విద్యాసహాయం, రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు.




## కరాటే క్రీడ సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తినిస్తాయి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరాటే క్రీడలు పిల్లల్లో మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే శక్తినిస్తాయని టిఎన్‌జివోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రపంచ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో చెన్నై తమిళనాడులో జరిగిన బోధి వరల్డ్ రికార్డు అధికారిక ప్రయత్నంలో పాల్గొని అప్రిసియేషన్ సర్టిఫికెట్ అందుకున్న అన్వర్‌ఖాన్, ఆయన కుమారులు ఫర్హాన్‌ఖాన్, అర్మాన్ ఖాన్‌లను శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సర్దార్ హర్మీందర్‌సింగ్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ రాజు, కోటేష్, మల్లేశం తదితర ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్ష పదవికి కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి ధరఖాస్తు

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలానికి చెందిన డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి సోమవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి కాంగ్రెస్ నాయకులతో కలిసి ధరఖాస్తు చేసుకున్నారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశానని, రాబోవు రోజుల్లో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వారి వెంట చొప్పదండి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ముద్దం తిరుపతి, రంగన్న, గుర్రం రమేష్, కడారి శంకర్, చిలుముల స్వప్న పాల్గొన్నారు.

## నూతనంగా ఎన్నికైన గౌడ సంఘ కమిటీకి సన్మానం

**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని భూపాలపట్నం గ్రామంలో నూతనంగా ఎన్నికైన గౌడ సంఘం కమిటీని కాంగ్రెస్ యువజన నాయకులు విద్యాసాగర్ ఆద్వర్యంలో ఘనంగా సన్మానించారు. గౌడ సంఘం అధ్యక్షుడు కొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రంగు వెంకటేష్, కమిటీ సభ్యులు మునిగాల శ్రీనివాస్, మునిగాల నారాయణ, మునిగాల అంజయ్య, పులి నారాయణ, ఆకుల భూమయ్య, మునిగాల శ్రీనివాస్, బత్తిని ప్రభాకర్, మునిగాల అంజయ్యలను సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి, మునిగాల శ్రీను, పూదరి సత్తయ్య, మానపాటి తిరుపతి, మునిగాల రవీందర్, రంగు రవి, మునిగాల నర్సయ్య, అంజయ్య, నారాయణ, లచ్చయ్యలు పాల్గొన్నారు.

## రైతులను రారాజుగా చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**ప్రజాపక్షం/రుద్రంగి:** రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యం, ఎక్కువ ధర ఇస్తామని నమ్మబలికే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి అన్నారు. మానాల రైతు వేదిక వద్ద ఫ్యాక్స్ చైర్మన్ ఏలేటి చిన్న రెడ్డి తో కలిసి రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలకల తిరుపతి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ చిలకల తిరుపతి ఫ్యాక్స్‌జన్ రెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని అన్నారు. రైతు బంధు, రైతు బీమా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కౌలు రైతులకు భరోసా వంటి పథకాలు దేశంలో మరెక్కడా లేవని , రైతులకు ఇబ్బంది కలగకుండా నేటి నుండే కొనుగోలు కేంద్రాల్ని ప్రారంభించామని, రైతులు వరి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు కల్లాల వద్దనే ధాన్యాన్ని ఎండబెట్టుకొని తేమ శాతం 17 దాటకుండా చూసుకోవాలని, ధాన్యం కొనుగోలులో తూనికల తారుమారు, రేట్ల విషయంలో అవకతవకలు జరుగుతే వెంటనే వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకువస్తే స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మానాల మోహన్ రెడ్డి సహకారంతో పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాలు, ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఇట్టి కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, మానాల ఫాక్స్ చైర్మన్ ఏలేటి చిన్నారెడ్డి, జలపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ముల రవీందర్ రెడ్డి, ఫ్యాక్స్ డైరెక్టర్లు జక్కు లింగన్న, జక్కు వంశీ, జక్కుల లక్ష్మి నారాయణ, ఇప్ప మహేష్, నారాయణ గౌడ్, తూమ్ రవీందర్, మైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## ఈటలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/జమ్మికుంట:** గత మూడు రోజుల నుంచి హుజురాబాద్ నియోజకవర్గంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌పై కొంతమంది బిఆర్‌ఎస్ నాయకులు సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బిజెపి నాయకుడు, మాజీ జడ్పిటిసి శ్రీరామ్ శ్యామ్, కొమ్ము అశోక్‌లు సోమవారం జమ్మికుంట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు ఈటల రాజేందర్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి ఎన్నికల సమయంలో హుజురాబాద్ నియోజకవర్గానికి వెయ్యి కోట్లు ఇస్తానని వాగ్దానం చేసి ఇప్పటికీ ఒక్క రూపాయి నిధులు తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. స్థానిక ఎమ్మెల్యే రీల్స్ వీడియోస్‌పై ఉన్న శ్రద్ద ఓటు వేసి గెలిపించిన హుజురాబాద్ ప్రజలపై లేదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఫిషరీస్ డైరీ కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు బోయిని నారాయణ, మహేష్, వెంకటేష్, కాసర్ల రాములు, అనిల్, సతీష్, మోటార్ సంపత్, పిల్లి సతీష్, ఇతర బిజెపి నాయకులు పాల్గొన్నారు.



## రోడ్డున పడ్డ 26వేల ఎస్‌సి ఎస్‌టి బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులు

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి రూ.220 కోట్లు విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బీమా సాహెబ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి సాగర్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన పేద విధ్యార్థులకు ఉచితంగా కార్పోరేట్ విద్యను అందించేందుకు గత 25 సంవత్సరాల క్రితం బెస్ట్ అవైలబుల్ స్కీంను ప్రవేశపెట్టారన్నారు. ప్రాథమిక తరగతిలో ఒక్కో విధ్యార్థికి ఏటా రూ.28వేలు, ప్రాథమికోన్నత తరగతిలో వసతితో కలిసి రూ.42 వేలు చొప్పున చెల్లిస్తారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎంపిక చేసిన 230 ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య భోజనం, పుస్తకాలు, బట్టలు, వసతి కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతి ఆరు నెలలకు ఒకసారి నిధులు చెల్లించడం వల్ల ఈ పథకం సజావుగా సాగుతూ వస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 220 కోట్ల రూపాయలను ప్రైవేట్ పాఠశాలలకు బకాయి పడిందన్నారు. దళిత గిరిజన విధ్యార్థి సంఘాలు గత ఏడాది కాలంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా ఒక్క రూపాయి సైతం చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బకాయిలను చెల్లించకపోవడంతో ఈ పథకంలోని విధ్యార్థులకు విద్యతో పాటు భోజనం, వసతి కల్పించలేకపోతున్నామని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తూ అక్టోబర్ 6 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నాయన్నారు. గత వారం రోజులుగా పాఠశాలకు వెళ్లకుండా రోడ్డున పడ్డ దళిత గిరిజన విధ్యార్థులు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేయడంలో ఆర్థిక, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన శాఖ మంత్రులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దళిత, గిరిజన ఎమ్మెల్యే తక్షణం స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చివిడుదల చేయించాలని అన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు కునుసోతు శ్రీనివాస్ నాయక్, రాము నాయక్, ఎస్‌ఎఫ్ నాయకులు సన్నిహిత్ పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎం.హరిత ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి కలెక్టర్ ఎం.హరిత దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 81 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ శాఖకు 48, పంచాయితీ రాజ్ శాఖకు 11, ఎస్పీ కార్యాలయానికి 5, ఉపాధి కల్పనాశాఖకు 4, సిరిసిల్ల మున్సిపాలిటీ, విద్యా శాఖకు 3 చొప్పున, పౌరసరఫరాలు, మత్స్య, వైద్యారోగ్య, రవాణా, సంక్షేమ, వేములవాడ మున్సిపాలిటీ, జిల్లా పరిషత్ కు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## డిసిసి అధ్యక్షుడిగా తిప్పారపు సంపత్ దరఖాస్తు

**ప్రజాపక్షం/సైదాపూర్ :** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్ష పదవీ కొరకు తిప్పారపు సంపత్ దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం తిప్పారపు సంపత్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ఏళ్ల తరబడి పనిచేస్తూ విద్యార్థి ఉద్యమాలు, యువజన ఉద్యమాలు, దళిత ఉద్యమాలు చేస్తూ బిఆర్‌ఎస్ అరాచక పాలనలో మాజీ మంత్రి ఈటల రాజేందర్ అవినీతిపై పోరాడి నెలల తరబడి జైల్లో గడిపిన ఎన్నో కేసులు పెట్టి పోలీస్ స్టేషన్‌లో జైళ్లచుట్టు తిప్పినప్పటికి ఏ ఒక్క రోజు అధైర్య పడకుండా నమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిషలు కష్టపడి పార్టీ మారకుండా పార్టీలో ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రతిపక్షాలు ఎంత అణచి వేతకు గురి చేసినా ఏ ఒక్క రోజు తన పోరాటం ఆపలేదని అన్నారు. కింది స్థాయి నుండి ఒక దళిత మాదిగ కుటుంబం నుండి వచ్చిన నాలాంటి వాడికి కాంగ్రెస్ అధిష్టానం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షునిగా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## ముగిసిన బ్లాక్ లెవెల్ క్రీడా పోటీలు

**ప్రజాపక్షం/వీణవంక:** వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వశాఖ, మైభారత్, యువ చైతన్య ఫ్రెండ్స్ యూత్ క్లబ్ మల్లారెడ్డిపల్లి ఆద్వర్యంలో నిర్వహించిన బ్లాక్ లెవెల్ క్రీడాపోటీలు ముగిసాయి. ఈ సంధర్బంగా విజేతలకు జిల్లాయువజన అధికారి వెంకట రాంబాబు బహుమతులు అందజేశారు. వాలీబాల్ ప్రథమ బహుమతి మల్లారెడ్డిపల్లి, ద్వితీయ బహుమతి చెంజర్ల, కబడ్డీ మొదటి బహుమతి మర్రిపెల్లి గూడెం, ద్వితీయ బహుమతి మల్లారెడ్డిపల్లి సాధించారు. కార్యక్రమంలో యూత్ క్లబ్ అధ్యక్షుడు కర్రె నాని, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, దూలం సురేష్, గోనెల పెద్దులు, రాయణవేణి తిరుపతి, దూలం నరేష్, నల్లవెల్లి శంకర్, కొలిపాక శ్రీను, సమ్మయ్య, శ్రీనివాస్ కుమార్, రాజయ్య, క్రీడాకారులు రాము, ప్రశాంత్, బాలస్వామి, మురళి, అనిల్, గణేష్, రాజు,గోపి, విజయ్, చందు, అఖిల్, నాని, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## బిర్లా స్కూల్ విద్యార్థినికి రాష్ట్రస్థాయి స్కేటింగ్‌లో రజత పతకం

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ 6వ తరగతి విద్యార్థిని శ్రీహన్సీ పాట్నాన రోలర్ స్కేటింగ్‌లో అద్భుత విజయాన్ని సాధించింది. ఈ విషయాన్ని ఆమె కోచ్ సాయిరామన్ తెలిపారు. వ్యాయామ విభాగాధిపతి మురళీధర్ మాట్లాడుతూ తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆద్వర్యంలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధీనంలో సరూర్‌నగర్ స్టేడియం (రింక్), తక్కుగూడ రోడ్డు వద్ద నిర్వహించిన 12వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్(స్పీడ్) 2025లో శ్రీహన్సీ రజత పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యిందని తెలిపారు. ఈ విజయంతో పాఠశాలకు గర్వకారణంగా నిలిచిందని ప్రిన్సిపల్ డా.భబిత విశ్వనాథన్, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డిలు, ఉపాధ్యాయ బృందం హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# వసతి గృహాలకు పంపిణీ చేసే సరుకుల ధరలు పెంచడం హర్షణీయం

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** రాష్ట్రంలోని వసతి గృహాలకు సరఫరా చేసే సరుకుల ధరలను పెంచడం హర్షణీయమని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంకటి లింగమూర్తి, కోశాధికారి భాస్కర్ అనిల్,ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగపురి మనోహర్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ గురుకుల అసోసియేషన్ తరపున ప్రభుత్వానికి వసతి గృహాల సప్లైదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఇతర అధికారులకు విన్నవించామని పేర్కొన్నారు. గత జూన్ నుండి వసతి గృహాలకు క్యాటరింగ్ కిరాణ, చికెన్, మటన్, కూరగాయలు పాత రేట్లతోనే వేస్తున్నామని దానివల్ల ఆర్థికంగా నష్టపోతున్నామని ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేట్లు పెంచడం వల్ల కొంత ఉపశమనం కలిగిందని కాంట్రాక్టర్లు వాపోయారు. మార్కెట్లో ఉన్న రేట్ల ప్రకారం మరోసారి పెంచాలని కోరారు. సరుకుల రేట్లు పెంచినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు, ట్రైనీ డిప్యూటి కలెక్టర్ బనావత్ వనజ తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.వేములవాడ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన బండి వెంకటమ్మ ధర్మారం మండలం పత్తిపాక రెవెన్యూ గ్రామం సర్వే నెంబర్ 785, 786, మల్లాపూర్ గ్రామం లోని సర్వే నెంబర్ 132 లో గల తమ భూమి ఆక్రమణకు గురైందని, రికార్డులను పరిశీలించి ఆ భూమి తమకు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ ధర్మారం కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. సుల్తానాబాద్ మండలం మియాపూర్ గ్రామానికి చెందిన గండి రాయమల్లు సర్వేనెంబర్ 314 లో ఉన్న ఎకరం ఎనిమిది గంటల భూమి తన కుమారునికి పట్టా చేశానని, వృద్ధాప్యంలో తనకు తిండి పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఆ భూమి తిరిగి తన పేరు మీద పట్టా చేయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఆర్.డి.ఓ కు రాస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు.పాలకుర్తి మండలం కన్నాల గ్రామానికి చెందిన రాజేశ్వరి తమకు భూమి లేదని, ఇంటి స్థలం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.రామగిరి మండలం కల్వచర్ల గ్రామానికి చెందిన బి.లావణ్య తనకు కల్వచర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిందని, తనకు భూమి రత్నాపూర్ గ్రామంలో ఉందని అక్కడ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జి ఎఫ్ టైక్వాండో పోటీల్లో కాంస్యం

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ టైక్వాండో పోటీలు నిజమాబాద్ జిల్లా కేంద్రంలోని బస్వా గార్డెన్స్‌లో ఈనెల 10 తేది నుండి 12వ తేదివరకు నిర్వహించడం జరిగింది. జగిత్యాల పట్టణంలోని శ్రీ వాగ్దేవి పాఠశాల విద్యార్థి బొల్లె రేషన్(14) సంవత్సరాల విభాగం లోకాంస్య పథకం సాధించాడు. జగిత్యాల జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరి చక్రధర్ రావు, తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ గాదె సంతోష్, ప్రెసిడెంట్ గంగారావు, శ్రీ వాగ్దేవి ప్రిన్సిపాల్ సింగం సుమితారాణి, కోచ్ దావనపల్లి రాహుల్ కుమార్, జగిత్యాల తైక్వాండో కోచ్‌లు బొల్లే రోషన్‌ను అభినందించారు.

# కొరియర్, కార్గో సెంటర్లలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని టౌన్, డివిజన్లలో ఉన్న కొరియర్ ఆఫీసులు, కార్గో సెంటర్లు, పార్సెల్ సెంటర్లలో పోలీసులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలకు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా బస్టాండ్, ఆర్టీసీ కార్గో కార్యాలయం వద్ద పర్యవేక్షించారు. నిషేధిత వస్తువుల అక్రమ రవాణాను గుర్తించేందుకు ఈ తనిఖీల్లో ప్రత్యేకంగా శిక్షణ పొందిన పోలీసు జాగిలాలు రాంబో(ట్రాక్టర్), లియో (నార్కోటిక్), మైకి, టైసన్ (స్నిఫర్) పాల్గొన్నాయి. టౌన్ డివిజన్ పరిధిలోని కిసాన్‌నగర్, బొమ్మకల్ చౌరస్తా, హౌజింగ్‌బోర్డు కాలనీ, రాంనగర్, ముకరంపుర, జ్యోతినగర్, కాశ్మీర్‌గడ్డ, గోదాంగడ్డతో పాటు పలు ముఖ్య ప్రాంతాల్లోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఉన్న కొరియర్, కార్గో కార్యాలయాలలో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపి గౌష్ ఆలం మాట్లాడుతూ కొరియర్, కార్గో మార్గాల ద్వారా అబ్జెక్షన్ మెటీరియల్ నిషేధిత మాదకద్రవ్యాలు, గంజాయి, ఎక్స్‌ప్లోజివ్స్, ఫైర్ ఆర్మ్స్ అక్రమంగా రవాణా అవుతున్నాయనే అనుమానంతో ఈ తనిఖీలు నిర్వహించామని పేర్కొన్నారు. ప్రజల రక్షణార్థం, అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహకరించి అనుమానాస్పద పార్సెల్‌లు , కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ఏసిపి వెంకటస్వామి, ఇన్స్‌పెక్టర్లు రాంచందర్‌రావు, సృజన్‌రెడ్డి, జాన్‌రెడ్డి, పుల్లయ్య ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ఓటు చోరీని అడ్డుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండల కేంద్రంలో హుజురాదాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఒడితల ప్రణవ్‌బాబు పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఓటు చోరీ పేరిట సంతకాల సేకరణ కార్యక్రమం, ప్రదర్శనలు నిర్వహిస్తోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పెద్ది కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు పవిత్రమైన హక్కు అని, ప్రజల ఓటుతోనే ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. కానీ దేశంలో ఎన్నికల సమయంలో ఓట్లు చోరీ చేయడం, ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని ఏఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీ ఓటు చోరీకి వ్యతిరేకంగా పోరాడుతున్నారని పేర్కొన్నారు. దేశాన్ని పాలిస్తున్న బిజెపి ప్రభుత్వం అప్రజాస్వామిక విధానాలతో దేశ ప్రజలను దయనీయమైన స్థితిలో నెడుతోందన్నారు. కార్యక్రమంలో కనుమల్ల సంపత్, రామకృష్ణ, మేష రాజయ్య, గోరుకుంట్ల స్వామి, మర్రి వీరారెడ్డి, మూడెడ్ల రమేష్, భోగం సాయిరాం, మేకల సురేష్, గుడిశాల పరమేశ్వర్, పెద్ది శివకుమార్, మారెపల్లి ప్రశాంత్, గొడుగు మానస, రేణిగుంట్ల రవీందర్, గూడెపు ఓదెలు, గంగారం మహేష్, భోగం చిరంజీవి, భోగం పృధ్వి, జక్కు కుమార్, దంసాని తిరుపతి, రాజేందర్, బొమ్మిడి సతీష్, సప్పి రవి, మొగిలిపాక శ్రీనివాస్, బుర్ర విజయ్ కుమార్, పైడిపల్లి దేవేందర్, కుమారస్వామి తదితరులున్నారు.



# బిసిలను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని:** బిసిలను రిజర్వేషన్ పేరుతో మోసం చేసింది అధికార కాంగ్రెస్ ప్రభుత్వమేనని, తక్షణమే బిసిలకు రిజర్వేషన్లు అమలు చేయాలని పెద్దపల్లి బీఎస్పీ జిల్లా ఇన్చార్జి వరికిల్ల మల్లేష్ పేర్కొన్నారు. మంథని ప్రెస్ క్లబ్ లో బీఎస్పీ మంథని అసెంబ్లీ ఇన్చార్జి జనగామ రవికుమార్ ఆధ్వర్యంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్చార్జి మల్లేష్ పాల్గొని మాట్లాడుతూ సుమారుగా 52 శాతం ఉన్నటువంటి బీసీ జనాభా రిజర్వేషన్లు అడగడం సమంజసం కాదని, ఐదు శాతం ఉన్నటువంటి ప్రజలు పాలకులుగా బీసీలను మోసం చేస్తున్నారని ఆయన తెలిపారు. వెంటనే బీసీలకు సరైన రిజర్వేషన్ కల్పించాలని ఆయన పేర్కొన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ తరఫున బీసీలకు న్యాయం చేస్తామని ఆయన వివరించారు. జనరల్ స్థానాలలో బీసీలకు అవకాశం కల్పిస్తామని, బీసీలు మేలుకోవాల్సిన సమయం ఆసన్నమైందని, వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన కోరారు.భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ ఆర్ గవాయ్ పైన దాడి చేయడం ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.ఈ సందర్భంగా మంథని అసెంబ్లీ ఇన్చార్జి జనగామ రవికుమార్ మాట్లాడుతూ..అధికార ప్రభుత్వం బీసీలకు తగు న్యాయం చేయాలని, వెంటనే రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ అన్ని స్థానాలలో పోటీ చేస్తుందని, బీసీలకు తగు న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ ఆర్ గవాయ్ పైన దాడి చేసిన వారిని గుర్తించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపెల్లి జిల్లా బీఎస్పీ ఉపాధ్యక్షుడు నర్ల గోపాల్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, పెద్దపల్లి అసెంబ్లీ అధ్యక్షుడు బొంకూరి దుర్గయ్య, సీనియర్ నాయకులు ఇరుగురాల సదానందం పాల్గొన్నారు.




# మడిపల్లి రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేలా చొరవ చూపాలి

ప్రజాపక్షం/జమ్మికుంట:జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో 18ఇ గేటు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు రైల్వే అధికారులు సర్వే చేశారని, కానీ కొందరు వారి స్వార్థం కోసం సర్వే చేసిన చోట కాకుండా వేరే చోటకు మార్చాలని చూస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. రైల్వే గేటు జమ్మికుంట, హుజురాబాద్ మండలాల ప్రజలు, రైతులు ఉపయోగించుకునేందుకు వీలుగా ఉంటుందని, కావున రైల్వే అధికారులు సర్వే చేసిన వద్దనే రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణమయ్యేలా చొరవ చూపాలని సోమవారం మడిపల్లి రైతులు కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాపక్షం/చొప్పదండి:పాల వ్యాను, ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందిన సంఘటన ఆర్నకొండ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో కరీంనగర్ నుంచి లక్షెట్టిపేట వెళ్తున్న పాల వ్యాను, ఆర్నకొండ నుంచి కరీంనగర్ వెళ్తున్న బైకుని ఎదురుగా ఢీకొట్టగా సుల్తానాబాద్ మండలం పూసాలకు చెందిన మెరుగు సాయికిరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనుకాల కూర్చున్న జడల మహేష్‌కు గాయాలయ్యాయి. మృతుడి తండ్రి మెరుగు శంకరయ్య ఫిర్యాదు మేరకు డిసిఎం వ్యాన్ డ్రైవర్ ముదేళ్ల రాజుపై కేసు నమోదు చేసి డిసిఎం వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

# వైద్యానికి ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/శంకరపట్నం:**శంకరపట్నం మండలం కల్వల గ్రామానికి చెందిన సంగి సందీప్ కుమార్తె శ్రద్ధ వైద్యఖర్చులకు పాడి ఉదయానంద్ రెడ్డి ఫౌండర్,సిఈవో యాప్‌టివి అండ్ టూరిటో రూ.20 వేలు అందజేశారు. ఈ సంధర్భంగా కుటుంబ సభ్యులు గ్రామస్తులు ఉదయానందరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి దాసారపు ప్రభాకర్, వెన్నంపల్లి నారాయణ, అమృత ప్రభాకర్, సమిండ్ల చిట్టి, దాసారపు రాజు, మంతెన శ్రీధర్, తాళ్లపెల్లి కుమారస్వామి, సిరిగిరి రాజశేఖర్, దాసారపు అశోక్, వంశీకృష్ణ, లోకేష్, పస్తం కుమార్ స్వామి, నీల ప్రభాకర్, సంగి మహేందర్, గట్టయ్య, చల్లూరి హరీష్, దాసారపు మహేందర్, సమ్మయ్యలు పాల్గొన్నారు.

# ఎల్ మడుగులో వ్యక్తి గల్లంతు.. ఆచూకీ కోసం గాలింపు చర్యలు

**ప్రజాపక్షం/ముత్తారం/మంథని :** ఎల్ మడుగులో వ్యక్తి గల్లంతైనా ఘటన మంథనిలో చోటు చేసుకుంది.స్థానికుల వివరాల ప్రకారం.. మంథని మండలం ఖాన్ సాయి పేట గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి చెందిన మోటార్ చెడిపోవడంతో బయటకు తీయడానికి ఇద్దరు వ్యక్తుల సహాయం కోరాడు.ఈ క్రమంలో ఓ వ్యక్తి నీటిలో జారీ గల్లంతైనట్లు సమాచారం. ఎల్ మడుగులో మొసళ్లు సంచరిస్తుంటాయి. దీంతో మొసళ్ళు తీసుకెళ్లి ఉంటాయని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గల్లంతయిన వ్యక్తి ఆచూకీ కోసం పోలీస్, ఫైర్ తో పాటు సంబంధిత అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** తన ఆటోలో డబ్బులతో ఉన్న చేతి సంచిని పెద్దపెల్లి పోలీసులకు అప్పచెప్పి నిజాయితీని చాటుకున్నాడు పెద్దపల్లికి చెందిన ఆటో డ్రైవర్ కుంభాల ప్రభుదేవా వివరాలకు వెళితే సోమవారం రోజున ఉదయం రంగంపల్లికీ చెందిన పర్లేళ్ల లక్ష్మి తన పని నిమిత్తం రంగంపల్లి నుండి ఆటోలో జెండా చౌరస్తా కు వెళ్లిన క్రమంలో ఆమె ఆటోలో తన చేతి సంచిని మర్చిపోవడం జరిగినది. అ తర్వాత ఆటో డ్రైవర్ కుంభాల ప్రభుదేవా తన ఆటోలో ప్రయాణికులు మర్చిపోయిన చేతి సంచిని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి సమాచారం ఇవ్వగా ఎస్ఐ అట్టి ప్రయాణికురాలను గుర్తించి ఆటో డ్రైవర్ ద్వారా నిజాయితీని చాటుకున్న ఆటో డ్రైవర్ చేతి సంచిని ఆమెకు ఇప్పించడం జరిగింది. అట్టి సంచిలో తన 17 వేల రూపాయలు యధావిధిగా ఉన్నవని ఆమె తెలపగా, నిజాయితీ ని చాటుకున్న ఆటో డ్రైవర్ ప్రభుదేవ ను పెద్దపెల్లి SI లక్ష్మణ్ రావు అభినందించగా బాధితురాలు కృతజ్ఞతలు తెలిపింది.

# 19న వేములవాడకు శృంగేరి పీఠాధిపతి రాక



ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి ఈ నెల 19వ తేదీన ఆదివారం శృంగేరి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ జగద్గురు విధు శేఖర భారతి స్వామి రానున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ వెల్లడించారు. శృంగేరి పీఠాధిపతి రాక సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై వేములవాడలోని రాజన్న ఆలయ చైర్మన్ గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ విప్, ఎస్పీ మహేష్ బి గితే, దేవదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి ఆలయ ఈవో రమాదేవి సమీక్షించారు. ఇట్టి సమావేశంలో ఆలయ స్థానాచార్యులు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. పీఠాధిపతి రానున్న సందర్భంగా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు.

## కొండగట్టు హుండీ ఆదాయం 1 కోటి 8లక్షలు

ప్రజాపక్షం/మల్యాల : జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట కొండగట్టు అంజనేయ స్వామి ఆలయం లో సోమవారం శ్రీ వేంకటఅన్న మాచార్య సేవా ట్రస్ట్ కరీంనగర్ ఆధ్వర్యంలో 81 రోజులకు గాను 12 హుండీలను విప్పి లెక్కించగా హుండీ ఆదాయం 1కోటి 8లక్షల72 వేల 591 రూపాయలు, విదేశీ కరెన్సీ నోట్లు 55 ,హుండీ లలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండి లను తిరిగి సీల్ వేసి హుండీ లలో భద్ర పరిచినట్లు ఆలయ ఈవో శ్రీకాంత రావు పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్ దేవాదాయ శాఖ ఉప కమిషనర్ సుప్రియ పరిశీలకులు గా,పర్యవేక్షణాధికారిగా రాజ మొగిలి, ఆలయ ఈవో శ్రీకాంత రావు, సూపరిటెండెంట్ చంద్రశేఖర్, హరిహరనాథ్, సునీల్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, స్థానాచార్యులు కపిందర్, ఏ ఎస్పై శ్రీనివాస్, హోం గార్డ్స్, బ్యాంక్ సిబ్బంది, పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంపై రాజకీయం చేయొద్దు..

ప్రజాపక్షం/తంగళ్ళపల్లి : వేములవాడ రాజన్న ఆలయంపై రాజకీయం చేయవద్దని తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు జలగం ప్రవీణ్ రాజకీయ పార్టీల నాయకులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజా పాలన ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధిని అడ్డుకోవద్దని అడ్డుకుంటే చరిత్ర హీనులుగా మిగిలిపోతారని బీజేపీ, నాయకులను ప్రవీణ్ హెచ్చరించారు.పదేళ్లుగా బీజేపీ, బిఆర్ఎస్ రెండు ప్రభుత్వాలు రాజన్న గుడిని ఎందుకు అభివృద్ధి చేయలేక పోయారని ప్రశ్నించారు. ఆగమ శాస్త్రం ప్రకారమే ఆలయ పునర్నిర్మాణం జరుగుతుందని పేర్కొన్నారు. ఆలయాన్ని రాజకీయ వేదికగా మార్చవద్దని హితవు పలికారు.అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో భక్తులకు దర్శనం ఎలా సాధ్యం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు నేరెళ్ల నరసింగం గౌడ్, డైరెక్టర్స్, మండల కమిటీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాపక్షం/మల్లాపూర్: కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓటు చోర్ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఓట్ల చోరీ జరుగుతుందని కాంగ్రెస్ అధిష్టానం పలుమార్లు ఫిర్యాదు సైతం చేసిందన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, నాయకులు జలపతి రెడ్డి, సిరిపురం రవీందర్, నల్లరాజారెడ్డి ,బండారి రమేష్, ఏఎంసీ డైరెక్టర్ నూతిపెల్లి రాజం, నర్సారెడ్డి నరేష్, మల్లయ్య, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## బిజెపి నాయకులు భక్తులను తప్పుదోవ పట్టించ వద్దు

ప్రజాపక్షం/రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం మండల కాంగ్రెస్ శ్రేణులు భక్తులతో కలిసి రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి ప్రభుత్వ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బిజెపి నాయకులు గుడి నిర్మాణం జరుపు తుంటే రాద్దాంతం చేస్తున్నారని ఒక వంద 50 కోట్లతో గుడి నిర్మాణం పెద్దలు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయ అభివృద్ధి జరుగుతుంటే కొందరు కావాలని అడ్డుకుంటున్నారని, భక్తులను తప్పుదోవ పట్టించకుండా ఆలయ అభివృద్ధికి సహకరించి పనులు సవ్యంగా జరిగేటట్లు చూడాలన్నారు. భక్తులకు ప్రత్యామ్నాయంగా రాజన్న అనుసంధాన దేవాలయమైన భీమేశ్వర ఆలయంలో ఈనెల 11న వేద పండితుల సూచన సలహాలతో దర్శనాలను ఏర్పాటు చేస్తే దాన్ని చూసి ఓర్వలేక పోతున్నారని అన్నారు. ఆలయ అభివృద్ధి శృంగేరి పీఠాధిపతి వారిచే వారి అనుమతులతో ప్రభుత్వం విస్తరణ పనులు చేపట్టిందని, దాదాపు 150 పిల్లర్లు నిర్మించే క్రమంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయంగా భీమేశ్వరాలయం లో సౌకర్యాలు ఏర్పాటు చేశారన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించి అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలుపాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ఎర్రం గంగ నరసయ్య, గండి నారాయణ, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, సామ మోహన్ రెడ్డి, తర్రె లింగం, ఇప్ప మహేష్, పల్లి గంగాధర్, చేలుకల శ్రీనివాస్, దయ్యాల శ్రీనివాస్, దాసరి గంగా రాజం, గండి అశోక్, కటికే హీరోజి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వానికి పాలాభిషేకం



ప్రజాపక్షం/చందుర్తి: మండల కేంద్రం లో ఆదివారం బీజేపీ శ్రేణులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సోమవారం మండల కాంగ్రెస్ శ్రేణులు మండల కేంద్రం లోని బస్టాండ్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దక్షిణ కాశీ వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులలో భాగంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకే దర్శనాలు భీమన్న ఆలయం లో ఏర్పాటు చేశామని, స్వామివారి ఏకాంత సేవలు ప్రతినిత్యం జరుగుతాయని ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారన్నారు.ఆలయం మూసివేయలేదని కానీ బీజేపీ దానిపై అనవసరపు రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నదని దుయ్యబట్టారు.స్వామి వారి ఆలయ అభివృద్ధి లో విలువైన సలహాలు సూచనలు ఇస్తూ సహకరించాలే కానీ ప్రజలను తప్పుదోవ పట్టించవద్దన్నారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి,ఏఎంసి వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం , మాజీ జెడ్పిటిసీలు నాగం కుమార్ , పొద్దు పొడుపు లింగారెడ్డి ,ఏఎంసి డైరెక్టర్ ఇందూరి మధు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయానికి అప్రతిష్ట తేవద్దు...



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ దేశంలో దక్షిణ కాశీగా పేరుపొందిన వేములవాడ రాజన్న ఆలయానికి అప్రతిష్ట తేవద్దని వివిధ పార్టీల నాయకులను కార్యకర్తలను కోరారు. ఆదివారం రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసిన బిజెపి కార్యకర్తలు ఒక్కసారి ఆలోచించాలని కోరారు. ఎన్నో సంవత్సరాల క్రింద నిర్మాణమైన ఆలయాన్ని విస్తరణలో భాగంగా నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని ఈ పనిని బిజెపి నాయకులు అడ్డుకోవద్దని హితవు పలికారు. ఆగమ శాస్త్ర నిపుణుల సూచనల మేరకే ఆలయ విస్తరణ పనులు జరుగుతున్నాయని. గర్భగుడిని ముట్టుకోవడం లేదని రాజన్న పూజలు యాధావిధిగా కొనసాగుతాయని అన్నారు. కేవలం భక్తుల సౌకర్యార్థం భీమన్న గుడిలో కోడె మొక్కులు నిత్య పూజలు జరుగుతాయని ఆలయ ఈవో, వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్ తెలిపిన బిజెపి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. శృంగేరి పీఠాధిపతి శ్రీ జగద్గురు పరిశీలన తర్వాతనే ఆలయ పనులు ప్రారంభమయ్యాయని, ఇప్పటికైన కొన్ని వేల సంవత్సరాలకు చరిత్రలో నిలిచిపోయే విధంగా రాజన్న గుడిని సందర్శించడం ఈ ప్రాంతం చేసుకున్న అదృష్టంగా భావించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ఎస్కే సాబేర బేగం గౌస్, వైస్ చైర్మన్ రామ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, చెన్ని బాబు, నంది కిషన్, గంట లక్ష్మి , శ్రీనివాస్, తిరుపతి గౌడ్ , మల్లారెడ్డి, గంట బుచ్చగౌడ్, బండారి బాల్‌రెడ్డి, శ్రీనివాస్, గోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ ప్రాథమిక కేంద్రాలలో నమోదు పెంచాలి



ప్రజాపక్షం/కరీంనగర్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ కేంద్రాలలో నమోదును పెంచాలని, ప్రతి కేంద్రంలో 20 మంది పిల్లలు తగ్గకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఎంఈవోలు, ఎంపిడివోలు, సిడిపివోలతో పూర్వ ప్రాథమిక పాఠశాలలపై సమీక్షించారు. జిల్లాలో నిర్వహిస్తున్న 20 పూర్వ ప్రాథమిక కేంద్రాలలో నమోదు తక్కువగా ఉందని, వారం రోజుల్లోగా ప్రతి కేంద్రంలో 20 మంది పిల్లలను నమోదు చేయించాలని ఆదేశించారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రాలలో ఇప్పటికే ఇన్స్ట్రక్టర్, ఆయా నియామకం పూర్తయిందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి మొండయ్య, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సిడిపివోలు, ఎంపిడివోలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకను సేవా కార్యక్రమంగా మార్చిన లయన్స్ క్లబ్




ప్రజాపక్షం/రామగిరి: శస్త్ర చికిత్స చేసుకున్న బాధితునికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిత్యవసర సరుకులు అందజేశారు. వివరాల్లోకి తెలితే కల్వచర్ల గ్రామానికి చెందిన బోగ్గుల కనకయ్యకు ఆరోగ్య సమస్యల కారణంగా తాను పని చేసుకోలేక ఇబ్బంది పడుతున్న విషయం లయన్స్ క్లబ్ దృష్టికి రాగా వెంటనే స్పందించి సోమవారం గౌడ సత్తన్న కూతురు వైష్ణవి పుట్టిన రోజు సందర్భంగా సహాయం చేయడానికి ముందుకు రావడంతో వారితో పాటు క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి, డాక్టర్ శరణ్య యాదవ్, సహకారంతో బోగ్గుల కనకయ్యకు రెండు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేసారు. అనంతరం లయన్స్ క్లబ్ క్లబ్ ప్రెసిడెంట్ మేకల మారుతి మాట్లాడుతూ సమాజంలో ఇలాంటి అవసరమైన సందర్భాల్లో ప్రతి ఒక్కరు ముందుకు రావాలనీ, మానవతా విలువలు మనల్ని ఒక్కటిగా ఉంచుతాయనీ, జన్మదిన వేడుకలకు నిజమైన అర్థం మరొకరి జీవితంలో వెలుగు నింపడమే అని నమ్ముతూ లయన్స్ క్లబ్ ఎప్పుడూ ఇలాంటి సహాయ కార్యక్రమాల్లో ముందుండేందుకు కట్టుబడి ఉంటుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ఎల్ సి ఐ ఎఫ్ కోఆర్డినేటర్ మొల్మూరి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## చదరంగం పోటీలలో ప్రతిభా కనబరిచిన ఐపిఎస్ పాఠశాల విద్యార్థిని



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : జిల్లా స్థాయి చదరంగం పోటీలలో ఐపిఎస్ పాఠశాల విద్యార్థిని మంచి ప్రతిభ కనబరిచి ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా స్థాయి చదరంగ పోటీలు ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలలో స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల ఎనిమిదవ తరగతి విద్యార్థిని ఏ.అన్విత 14 సంవత్సరాల బాలికల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి ఉమ్మడి జిల్లాకు ఎంపికయ్యారు. ఎంపిక పట్ల పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్ ప్రిన్సిపల్ కృష్ణప్రియ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదరంగం ఆడటం వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, పట్టుదల, జ్ఞాపక శక్తి పెరుగుతుందని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ, శివ, సతీష్, మమత పాల్గొన్నారు.

## కార్యాలయాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్

ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి: సబ్‌కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా తహసీల్దార్ కార్యాలయంను సోమవారం సందర్శించారు. రెవెన్యూ సదస్సులు దరఖాస్తులపై ధృవీకరణ చేయుట కోసం ఆదేశించారు. ఆఫీస్ రికార్డ్ గదిని పరిశీలించి తగు సూచనలు చేశారు.

## డ్రంక్ అండ్ డైవ్ కేసులో ముగ్గురికి రిమాండ్

ప్రజాపక్షం/ఎడపల్లి : నిజామాబాద్ పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో బోధన్ మెజిస్ట్రేట్ ఒక రోజు రిమాండ్‌ను విధించారు. షేక్ సలీం, సయ్యద్ మొహతార్, అలీన సుభాష్ లు ఎడపల్లి పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడగా, వారిని కోర్టులో హాజరుపరిచారు. విచారణలో మెజిస్ట్రేట్ ఈ ముగ్గురు వ్యక్తులకు ఒకరోజు రిమాండ్‌ను విధిస్తూ తీర్పు చెప్పారు. ఇదిలా ఉండగా ఎడపల్లి మండలంలో ఆన్లైన్ మట్కా నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని జాన్కంపేట్ గ్రామానికి చెందిన షేక్ అమీర్ అనే వ్యక్తి మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్ మట్కా ఆడిస్తూ పట్టుబడినట్లు ఎడపల్లి ఎస్సై రమ తెలిపారు. ఎడపల్లి మండల పరిధిలో చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు తాము కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సై రమ తెలిపారు.

## పారిశుద్ధ్యంపై గ్రామ కార్యదర్శులకు అవగాహన సదస్సు

ప్రజాపక్షం/నందిపేట్: నందిపేట్ మండల కేంద్రంలోగల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గ్రామ కార్యదర్శులకు ఎంపిడివో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో వార్డులలో ఖాళీ ప్రదేశాలలో నీరు నిలిచి ఉండడం, చెత్త చెదారం ఉండడం వల్ల దోమలకు నిలయాలుగా మారుతున్నాయని వారు సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలకు చేపట్టి పదిహేను రోజులు అన్ని వార్డులలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, లక్ష్మి, ప్రసాద్, సూపర్‌వైజర్ భాస్కర్, సిబ్బంది, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలి

ప్రజాపక్షం/మల్యాల: జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని మ్యాడంపెల్లి 11 కెవి విద్యుత్ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో మంగళ వారం విద్యుత్ వైర్లకు తగిలే చెట్ల కొమ్మలను తొలగించనున్నందున విద్యుత్ సరఫరా ఉదయం 8 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు మల్యాల ట్రాన్స్కో ఏఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యుత్ మరమ్మత్తుల వల్ల మండలంలోని తక్కళ్లపెల్లి సబ్ స్టేషన్ పరిధిలో గల మ్యాడంపల్లి గ్రామ వ్యవసాయబావులకు, గృహ వినియోగదారులకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ వివరించారు.ఈ విద్యుత్తు అంతరాయానికి వినియోగదారులు ,రైతులు సహకరించాలని ఏఈ కోరారు.

## డిసిసి నియామకానికి వారం రోజుల పర్యటన




ప్రజాపక్షం/నిజామాబాద్: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి నాయమక ప్రక్రియకు సంబంధించి వారం రోజులు పర్యటన ఉంటుందని ఏఐసిసి పరిశీలకులుగా కర్ణాటక ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ విచ్చేశారు. ఈ సందర్భంగా హోటల్ హరితలో జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కర్ణాటక ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి నియామక ప్రక్రియకు సంబంధించి వారం రోజులు పర్యటించనున్నామన్నారు. మొదటిరోజు మంగళ వారం బోధన్ నియోజకవర్గంలో ఉదయం 10 గంటలకు బ్లాక్ ఎ, మధ్యాహ్నం 2 గంటలకు బ్లాక్ బి, బుధవారం ఆర్మూర్ నియోజకవర్గంలో ఉదయం 10 గంటలకు బ్లాక్ ఎ, మధ్యాహ్నం 2 గంటలకు బ్లాక్ బి, గురువారం బాల్కొండ నియోజకవర్గం ఉదయం 10 గంటలకు, బ్లాక్ బి శుక్రవారం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఉదయం 10 గంటలకు బ్లాక్ ఎ, మధ్యాహ్నం 2 గంటలకు బ్లాక్ బి, శనివారం అర్బన్ నియోజకవర్గంలో ఉదయం 10 గంటలకు బ్లాక్ ఎ, 12 గంటలకు బ్లాక్ బి, సాయంత్రం బాన్సువాడ నియోజకవర్గం బ్లాక్ బి సమావేశాలు నిర్వహించటం జరుగుతుందన్నారు.

## దర్శన భాగ్యం కల్పిస్తూనే అభివృద్ధి పనులు చేపట్టాలి




ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకొని రాజన్న దర్శన భాగ్యం కల్పిస్తూనే అభివృద్ధి పనులుచేపట్టాలని సిరిసిల్ల బిజెపి పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. రాజన్న ఆలయ అభివృద్ధికి బిజెపి వ్యతిరేకం కాదన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. అభివృద్ధి పేరుతో భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దన్నారు. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వరస్వామి కోట్లాది ప్రజల ఇలవేల్పు కష్టాలను, బాధలను మొరపెట్టుకుంటే కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం మన రాజన్న దైవమని కొనియాడారు. దూరభారాన్ని సైతం లెక్క చేయకుండా తెలంగాణసహా యావత్ దేశం నలుమూలల నుండి నిత్యం 50 వేల మంది భక్తులు దర్శించుకునే పుణ్యధామం వేములవాడ రాజన్న ఆలయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన పర్యాటక ప్రదేశాల్లో ఎక్కువ మంది భక్తులు సందర్శించే దివ్యధామం మన వేములవాడ అన్నారు. భక్తులు తమ బాధలను దేవదేవుడికి చెప్పుకునే అవకాశాన్ని దూరం చేయడం కాదా? రాజన్నను దర్శించుకుందామని వస్తే భీమన్న వద్దకు వెళ్లాలని చెప్పడం కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీయటమే అన్నారు. అవసరమైతే రాజన్న క్షేత్రంలోనే ఆగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తంగా బాలాలయాన్ని ప్రాణప్రతిష్ట చేసి భక్తులకు దర్శనం కల్పించాలన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని దుష్ప్రచారం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బతీయాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. హిందూ దేవాలయాల పునర్ నిర్మాణ చరిత్రను పరిశీలిస్తే .... దేశంలో ఎన్నో ప్రసిద్ధ ఆలయాలను అద్భుతంగా పునర్నిర్మించారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. దేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ఆలయాన్ని కూడా అభివృద్ధి పేరుతో భక్తులను దూరం చేసిన దాఖాలల్లేవన్నారు. వారణాసి, కేదారినాథ్, అయోధ్య, శబరి, మధుర మీనాక్షి, తెలంగాణలోనే యాదాద్రిదేశంలోని ఎక్కడ దేవాలయాలలో అభివృద్ధి పనులు జరిగిన దేవున్ని దర్శించుకోకుండా భక్తులకు దూరం చేయలేదన్నారు. గర్భాలయ అభివృద్ధి పనులు జరిగేటప్పుడు కూడా యాదాద్రి కొండపైనే బాలాలయాన్ని శాస్త్రోక్తంగా ప్రాణ ప్రతిష్ట చేసి భక్తుల దర్శనానికి ఇబ్బందుల్లేకుండా చేశారన్నారు. ఎక్కడ లేని వివక్ష వేములవాడలో ఎందుకు అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మ్యాన రాంప్రసాద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు వేముల వైశాలి, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేష్, మెరుగు శ్రీనివాస్, మోర శ్రీహరి, దూడం సురేష్, దేవేందర్ రెడ్డి, రామారావు, వినయ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతతో మహిళల సాధికారత..



ప్రజాపక్షం/ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని ధర్మారం గ్రామంలో మహిళల్లో, గ్రామస్తుల్లో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించే లక్ష్యంతో ఎడపల్లి ఎస్‌బిఐ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు, గ్రామస్తులకు ఆర్థిక విషయాలపై పూర్తి అవగాహన కల్పించారు. ఆర్థిక జ్ఞానం కలిగి ఉండటం వల్ల మహిళలు భవిష్యత్తులో ఆర్థిక సమస్యలను సులభంగా ఎదుర్కోగలరని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఎఫ్‌ఎల్ కౌన్సిలర్ పవన్ కుమార్ హాజరయ్యారు. ఇందులో భాగంగా మహిళలకు బీమా పథకాల ప్రాముఖ్యత వివరిస్తూ మహిళలందరూ తప్పనిసరిగా ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన వంటి ప్రభుత్వ బీమా పథకాల్లో చేరాలని వారు సూచించారు. ఈ పథకాలు చాలా తక్కువ ప్రీమియంతో అధిక ఆర్థిక భద్రతను అందిస్తాయని వివరించారు. అలాగే సైబర్ మోసాలపై అప్రమత్తత కలిగి ఉండాలని ప్రస్తుత కాలంలో పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆన్‌లైన్ లావాదేవీలు జరిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ చెప్పకూడదని సూచించారు. ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లయితే, వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఆర్థిక భద్రతతో కూడిన భవిష్యత్తు కోసం మహిళలు తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ సదస్సు వారికి మార్గదర్శకత్వం ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు టొబాకో అనార్థాలను వివరించిన ఉపాధ్యాయులు

ప్రజాపక్షం/మోర్తాడ్: నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామంలో గల జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం రోజు టొబాకో తినడం వల్ల ఎన్ని అనర్థాలు వస్తాయో టొబాకే దే రోజైనా సోమవారం నాడు విద్యార్థులకు ఉపాధ్యాయులు సవివరంగా వివరించారు. కమ్మర్‌పల్లి పిహెచ్‌సి సూపర్‌వైజర్ మారుతి గౌడ్, పాఠశాల విద్యార్థులతో టొబాకో వాడటం వల్ల వివిధ రకాల క్యాన్సర్లు వస్తాయని తెలిపారు. అలాగే టొబాకో ఉత్పత్తులు అంబార్, సిగరెట్, బీడీలు, చుట్టాలు, పరిసరాలలో వాడినట్లయితే భావి భారత పౌరులుగా వాటిని నిరోధించాలని విద్యార్థులకు తెలిపారు. తల్లిదండ్రులకు సమీపంలో వారికి టొబాకో అనర్థాలను తెలిపి అందరూ ఆరోగ్యంగా ఉండుటకు ఉపాధ్యాయులు, విద్యార్థులు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణు గోపాల్ రావు, ఉపాధ్యాయులు మహేష్ కుమార్, మమత, త్రివేణి, జయశ్రీ, నచ్చయ్య, సైఫ్ అలీ, రికార్డ్ అసిస్టెంట్ ఆశా వర్కర్లు సుమలత, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

## నందిపేట్ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు

ప్రజాపక్షం/నందిపేట్ : నందిపేట్ మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు సహకార శాఖ ఆధ్వర్యంలో తెరువనున్నారు. డొంకేశ్వర్, ఖుదావన్ పూర్, అయిలాపూర్ సహకార సంఘాల పరిధిలోని గ్రామాల రైతులు ఈ మొక్కజొన్న కేంద్రాలు ఉపయోగించుకోవాలని జిల్లా అధికారులు రైతులను కోరారు.

## ఆహ్వానం అందజేత

ప్రజాపక్షం/భీమ్‌గల్ : వచ్చేనెల 5న జరిగే లింబాద్రిగుట్ట (నింబాచల) లక్ష్మీ నర్సింహ స్వామి జాతరకు హాజరు కావల్సిందిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని నివాసంలో కలిసి పురోహితులు పార్థసారథి ఆహ్వానపత్రం అందజేశారు.

## బంగారం చోరీ కేసులో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

ప్రజాపక్షం/నిజామాబాద్ : బంగారం చోరీ కేసులో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కరాటె రమేష్ అన్నారు. సోమవారం ఇందల్వాయి మండలం లింగాపూర్ గ్రామంలో చోరికి గురైన బాధిత కుటుంబాన్ని ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కరాటే రమేష్, ముదిరాజ్ మండల కమిటీ అధ్యక్షులు మచ్చ రఘురాం ముదిరాజ్‌లు పరామర్శించారు. అనంతరం కరాటే రమేష్ ముదిరాజ్ మాట్లాడుతూ మూడేళ్ల జగన్ భార్య పిల్లలు తల్లిని వదిలి కుటుంబాన్ని పోషించడానికి విదేశాలకు వెళ్లగా, రెక్కల ముక్కలు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నారన్నారు. బతుకమ్మ పండగ రోజే ఇలా జరగడం బాధాకరమన్నారు. చిన్న గ్రామంలో భారీ దొంగతనం జరగడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకోవాలని కోరారు. ఇందల్వాయి పోలీసులు తక్షణమే వీలైతే డాగ్ స్క్వాడ్‌తో చర్యలు చేపట్టి బంగారాన్ని దొంగలించిన దొంగలను పట్టుకోవాల్సిందిగా కోరారు. ఈ చోరీ కేసులో ఇందల్వాయి పోలీసులు నిర్లక్ష్యం వహిస్తే సీపీ సాయిచైతన్య దృష్టికి తీసుకెళతామన్నారు. ఇకనైనా పోలీసులు దొంగతనం చేసిన వారిని పట్టుకుని బాధితులకు అప్పగించాలని కోరారు.

## ప్రతి మహిళ బలమైన పోషకాహారం తీసుకోవాలి

ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రతి మహిళ బలమైన పోషకాహారం తీసుకోవాలని తహసీల్దార్ శాంత అన్నారు. సోమవారం పోషణ మహోత్సవంలో భాగంగా ధర్పల్లి మండలం పోషణ మహోత్సవ కార్యక్రమం రామడ్గు రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ శాంత, ఐసీడీఎస్ డిచ్‌పల్లి ప్రాజెక్టు అధికారి జ్యోతి హాజరై ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశంలోని ప్రతి కుటుంబం పోషకాహార లోపాన్ని తరిమికొట్టాలన్నారు. ప్రతి కృరూరా ఆకు కూరలు, చిరుధాన్యాలు ఖచ్చితంగా తీసుకోవాలని, ప్రాధాన్యత అనుబంధ పోషకాహారమని, ప్రాముఖ్య న్యూట్రిషన్‌పై శ్రద్ధ వహించాలని లోపల పోషణ లోపాలకు గురి కాకుండా పిల్లలకు అందించే ఆహారం పెరుగుదల పర్యవేక్షణ తెలిపారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాలు,ఏడునెలల పిల్లలకు అన్నప్రాసన మూడు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం చేశారు. వంట పోటీల్లో పాల్గొన్న తల్లులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బుజ్జి, సరిత, హెల్త్ సూపర్‌వైజర్ భూలక్ష్మీ, సమాధానం, ఏఓ మనోజ్‌కుమార్, మండల అంగన్‌వాడీ టీచర్లు, ఎన్‌ఎంఎస్ పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ప్రజాపక్షం/నిజామాబాద్: కంఠేశ్వర్ బైపాస్‌లోని అశోక టౌన్‌షిప్‌లోని ఎమ్మెల్యే నివాసంలో రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాతృమూర్తి లక్ష్మీనర్సమ్మ గతనెల 29న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి భూపతిరెడ్డిని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భూపతిరెడ్డి మాతృమూర్తికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సీనియర్ నాయకులు ఉన్నారు.

# పేద ప్రజల మనిషి గుండా మల్లేష్

**సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి**



**ప్రజాపక్షం / ఆసిఫాబాద్ :** కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అమరజీవి గుండా మల్లేష్ 5వ వర్ధంతి వేడుకలను సిపిఐ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ అమరజీవి కామ్రేడ్ గుండా మల్లేష్ తన జీవితకాలం పూర్తిగా ప్రజా ఉద్యమాలతోనే గడిపారని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సింగరేణి కార్మికుల హక్కుల కోసం జరిగిన ఉద్యమాలకు ఆయన పెద్దన్న పాత్ర వహించారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకృష్ణ కమిటీకి ఎలాంటి షరతులు లేకుండా తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. అంతేకాకుండా, అసెంబ్లీలో పేద ప్రజల సమస్యలపై నిలదీసేవారని, నిజాయితీకి గుండా మల్లేష్ మారుపేరుగా నిలిచారని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పిడుగు శంకర్, కొదురుపాక మహేష్, వర్కొల్ రాకేష్, భావనే వికాస్, ధర్మీ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో పోషణ అభినయ కార్యక్రమం

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణం ఇందిరానగర్ కాలనీలో గల అంగన్వాడి కేంద్రాల్లో పోషణ అభినయ ప్రోగ్రామ్ లో భాగంగా అన్నప్రాసన, శ్రీమంతం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అంగన్వాడి టీచర్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు

## ఇల్లు అనేది ప్రతిఒక్కరి కల



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** పీవీటీజీ (పర్టిక్యులర్లీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్) ల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా,ఉట్నూర్ మండలం కామైపేట్ గ్రామానికి చెందిన 140మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గ్రామ ప్రజలు,లబ్ధిదారులు ఆనందంతో పాల్గొని,ప్రభుత్వం అందిస్తున్న ఈ సదుపాయంపై కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లు అనేది ప్రతి కుటుంబానికి ఆశ్రయం మాత్రమే కాదుఅది భవిష్యత్తుకు భరోసా.పిల్లల కలలకు పునాది అని ఈ కార్యక్రమం ద్వారా పీవీటీజీ కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడే దిశగా ప్రభుత్వం మరో ముఖ్యమైన అడుగు వేయడం చాలా సంతోషంగా వుందని,ప్రతి ఒకరి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేలా ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## మారథన్ రన్నింగ్‌లో అద్భుత ప్రతిభ

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణ కేంద్రం చెందిన డాక్టర్ కిరణ్ కుమార్ కరీంనగర్ లో నిర్వహించిన మారతాన్ రన్నింగ్ 21కిలో మీటర్ల కంపిటేషన్లో ఉత్తమ 3rd ప్రైజ్ సాధించారు.ఇందులో ఖానాపూర్ మండలం నుండి 21 మంది రన్నర్ లు పాల్గొనడం జరిగింది.ఖానాపూర్ నుండి పాల్గొన్న డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రన్నింగ్ అనేది గెలుపు కోసం కాకుండా వ్యాయామం కోసం ఆరోగ్యం మెరుగుపరచుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని,ప్రతి ఒక్కరు రోజు వాకింగ్,రన్నింగ్ చేస్తే ఎలాంటి అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. నువ్వుల రాజేందర్,వెంకట్రాములు, రాపెల్లి రాజు, భాశెట్టి, శివ, లోకిని మహేష్, బక్కి మహేష్, భాను, జన్నారపు శంకర్,తూముచరణ్,పరిమి శ్రీనివాస్, ముషరాఫ్, పెద్ది మల్లేష్, ఎల్లయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

## సివిల్ సెటిల్‌మెంట్లు అసలు చేయొద్దు

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :**తెలంగాణ రాష్ట్ర పోలీస్ ప్రధానాధికారి (డీజీపీ) శివధర్ రెడ్డి పోలీసులందరికీ నిర్దేశించిన నూతన కార్యాచరణ,అత్యంత ముఖ్యమైన ప్రాధాన్యతలను జిల్లాలోని పోలీసులందరికీ కూలంకుషంగా చేరవేసేందుకు నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల సోమవారం జిల్లా ప్రధాన కార్యాలయంలో ఒక ప్రత్యేక వి.హెచ్.ఎఫ్ సెట్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ,తెలంగాణ పోలీసింగ్‌కు నాలుగు మూల స్తంభాలైన 'న్యాయం,దృఢత,స్నేహం,వృత్తిపరమైన నిబద్ధత' అనే సూత్రాలతో నడుస్తూ,ప్రజలు భయం లేకుండా జీవించే,త్వరిత న్యాయం అందించే వ్యవస్థను నిర్మించాలని ఉద్ఘాటించారు.మన లక్ష్యం కేవలం చట్టాన్ని అమలు చేయడమే కాదని,ప్రజల్లో నమ్మకం కలిగించడం, వారు రక్షించబడినవారుగా,గౌరవించబడినవారుగా భావించేలా చేయడమేనని స్పష్టం చేశారు.సమర్థవంతమైన పోలీస్ వ్యవస్థకు పునాది అయిన ప్రాథమిక పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని,అదే సమయంలో డేటా ఆధారిత పోలీసింగ్,సైబర్ సామర్థ్యాల పెంపు వంటి సాంకేతికత,ఆధునీకరణ అంశాలపై దృష్టి సారించి దేశంలో అగ్రగామిగా నిలవాలని ఆదేశించారు.పేదలు,బలహీన వర్గాల ప్రజలు తమ సమస్యలతో దూర ప్రాంతాల నుండి,ఖర్చు పెట్టుకుని పోలీస్ సహాయం కోసం వస్తారని,వారి బాధలను సహనంతో విని,తక్షణమే న్యాయమైన పరిష్కారం అందించడం మన ప్రధాన బాధ్యతగా గుర్తు చేశారు.పోలీస్ శాఖ ప్రతిష్ఠను,ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే అవినీతి చర్యలు నుండి ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని,నిజాయితీ,పారదర్శకత,వృత్తిపరమైన నైతిక విలువలతో యూనిఫార్మ్‌కు గౌరవం తీసుకురావాలని ఎస్పీ జానకి షర్మిల జిల్లా పోలీసు సిబ్బందికి గట్టిగా దిశానిర్దేశం చేశారు.ముఖ్యంగా,పోలీస్ స్టేషన్లలో సివిల్ వివాదాల పరిష్కరం అస్సలు చేయవద్దని స్పష్టం చేశారు.

## చదువుతో పాటు ఆటపాటలకు ప్రాధాన్యం ఇవ్వాలి




**ప్రజాపక్షం/లక్ష్మణచందా :** 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 బాల బాలికలకు జిల్లా స్థాయి కబడ్డీ ఎంపిక పోటీలను జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల వడ్యల్ నందు జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి డిఇఓ భోజన్న ఎస్.జి.ఎఫ్ సెక్రెటరీ రవీందర్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.నిర్మల్ జిల్లాలోని వివిధ పాఠశాలల 14 సంవత్సరాల బాలబాలికలు పాల్గొన్నారు.ఈ ఆటల పోటీలను ఉద్దేశించి డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.విద్యార్థిని విద్యార్థులకు ఆటల పట్ల ఆసక్తి,అభిరుచి ఉండాలని మానసిక శారీరక దీని కొరకు ఉపాధ్యాయులు తోడ్పడాలని మాట్లాడారు.కబడ్డీ ఆట చాలా ఇష్టమని తను పాఠశాల స్థాయిలో అడిన ఆటల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా కాసేపు కబడి ఆట ఆడడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఈఓ అశోక్ వర్మ,పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రమణ రావు,వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు,గ్రామ మాజీ సర్పంచ్ లింగగౌడ్,ఉపసర్పంచ్ మోహన్,వీడీసి సభ్యులు పొలాస గోవర్ధన్,రాజేంద్రప్రసాద్,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన ప్రజావాణి దరఖాస్తులు పరిశీలన

**కలెక్టర్ అభిలాష అభినవ్**



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,ప్రతి దరఖాస్తును పరిశీలించి,తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు.మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పని చేయాలని సూచించారు.ప్రజావాణి కార్యక్రమం అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ,ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని చెప్పారు.అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ హాజరు పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రతి రోజు విద్యాసంస్థల్లో వంద శాతం ఉపాధ్యాయులు,విద్యార్థుల హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రత్యేక అధికారులు అందరూ ప్రభుత్వ విద్యాసంస్థలను నిరంతరం తనిఖీ చేస్తూ ఉండాలని చెప్పారు.ఈ నెల 15వ తేదీ నుంచి నవంబర్ 14వ తేదీ వరకు పశువుల్లో ఫుట్ అండ్ మౌత్ వ్యాధి నిర్మూలనకు గాను టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.పెండింగ్ లో ఉన్న వరద నష్ట నివారణ బకాయిలు చెల్లించేలా తహశీల్దార్లు చొరవ చూపాలని పేర్కొన్నారు.అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్,ఆర్డీవో రత్న కళ్యాణి,వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## శభాష్ పూర్వ విద్యార్థులు



**ప్రజాపక్షం/కుంటాల :** కుంటాల మండలంలోని లింబా(కే) జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2003–2004 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ విద్యార్థి దశను గుర్తు చేసుకుంటూ,పాఠశాలకు ఒక ఎలక్ట్రానిక్ బెల్‌ను విరాళంగా అందజేశారు.విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకున్న తర్వాత కూడా తమ పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయం.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.పురుషోత్తం,స్కూల్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్,ఉపాధ్యాయులందరూ కలిసి పూర్వ విద్యార్థులకు,ప్రస్తుత విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని ఉపాధ్యాయులు కొనియాడారు.

## వశిష్ఠ హైస్కూల్ చైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌కు అవార్డు



**ప్రజాపక్షం/నిర్మల్‌రూరల్ :** నిర్మల్ పట్టణంలోని వశిష్ఠ హై స్కూల్ చైర్మన్,ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ట్రస్మా స్టేట్ మెంటర్స్ అవార్డ్,2025–26 ను అందుకున్నారు.ఆదివారం హైదరాబాద్‌లోని పంజాగుట్ట ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును రాష్ట్ర ఉన్నత విద్య మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఇటికల పురుషోత్తం చేతుల మీదుగా శ్రీనివాస్ గౌడ్ స్వీకరించారు.ఈ కార్యక్రమానికి ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి,గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్ రావుతో పాటు రాష్ట్ర ట్రస్మా సంఘం నాయకులు,సభ్యులు పాల్గొన్నారు. విద్యారంగంలో శ్రీనివాస్ గౌడ్ అందించిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది.

## అతిథి అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తు

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :ఆసిఫాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. కనకయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితశాస్త్రం విభాగంలో ఉన్న ఖాళీల భర్తీకి అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ (పిజి)లో ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు 50 శాతం, ఇతరులకు 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, పిహెచ్‌డి, నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్), స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు అక్టోబర్ 16 సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను స్వయంగా కళాశాలలో సమర్పించాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

## కార్యకర్తల అభిప్రాయమే కీలకం

**ప్రజాపక్షం/పిట్లం:** కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుని ఎంపిక ప్రక్రియ కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సంఘటన సృజన్ అభియాన్‌మంగళవారం నిర్వహించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పాల్గొన్నారు. ఏఐసీసీ అబ్జర్వర్ రాజ్‌పాల్ ఖరోలాను ఎమ్మెల్యే సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంస్థాగత పునర్నిర్మాణంలో డీసీసీ అధ్యక్షుల నియామక ప్రక్రియ ప్రారంభమైందని,పార్టీ అభ్యున్నతికి పాటుపడే వ్యక్తిని అధ్యక్షునిగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. కార్యకర్తల అభిప్రాయాల ఆధారంగా ఎంపిక చేయడం వలన పార్టీ సంస్థాగత నిర్మాణం మరింత బలపడడానికి దోహదం చేస్తుందని ఆయన అన్నారు.

## బిసి రిజర్వేషన్లపై స్టే ఎత్తివేయాలి

ప్రజాపక్షం/మందమర్రి: బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై హైకోర్టు విధించిన స్టేకు నిరసనగా జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మందమర్రి పట్టణంలోని మార్కెట్ రహదారిపై దిగ్బంధం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదక కులాలుగా ఉన్న బిసిలను అణచివేసే అగ్రవర్ణాల కుట్రలను ఇకనైనా తిప్పికొట్టాలని, బిసిల హక్కుల కోసం పోరాడుతున్న ప్రతి ఒక్కరికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థలతో పాటు విద్య, ఉద్యోగాలు, చట్టసభల్లో బిసిలకు తగిన రిజర్వేషన్లు కల్పించినప్పుడే నిజమైన బిసి రాజ్యాధికారం సాధ్యమవుతుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే బిసి రిజర్వేషన్ల అంశంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఉదారి చంద్రమోహన్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. నీలకంఠేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిల్ల శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు శేఖర్, బిసి సంక్షేమ సంఘం నాయకులు రవిరాజా, వేణుగోపాల్, సంపత్, కలీం, శంకర్, సత్యనారాయణ, యోగానంద రావు, వీరయ్య, శంకర్, రమేష్, సదయ్య, రాజం, శ్రీనివాస్, రవీందర్, శ్రావణ్ కుమార్, రాజు, వసీం, పున్నం రాజు, ఓమేశ్వర్, కళ్యాణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మాయమాటలకు ప్రజలు మోసపోరు

ప్రజాపక్షం/కాసిపేట:మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కొండాపూర్ (యాప)లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ప్రెస్ మీట్‌లో మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ బిఆర్ఎస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్నాయని భయంతోనే బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ బాకీ కార్డుల పేరుతో ఊరూరా తిరుగుతున్నారని ఆయన అన్నారు. గడిచిన పది ఏళ్లలో ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా బిఆర్ఎస్ నెరవేర్చలేకపోయిందని, డబుల్ బెడ్‌రూమ్, రేషన్ కార్డులు కూడా ఇవ్వలేకపోయారని ఆయన ఆరోపించారు. ఫామ్ హౌస్‌లో కూర్చుని పాలన చేయలేమని బిఆర్ఎస్ నాయకులు తెలుసుకోవాలని, ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీదేనని స్పష్టం చేశారు. తమకు రెండేళ్ల అయ్యాయని, ఇంకా మూడేళ్ల మిగిలి ఉన్నాయని, ఇచ్చిన అన్ని హామీలను తప్పక నెరవేర్చుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రౌతు సత్తయ్య, గోలేటి స్వామి, దుర్గం ప్రవీణ్ తదితరులు మాట్లాడుతూ, బిఆర్ఎస్ పార్టీ ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదని, ఏ ఊరికి వెళ్లినా ఇందిరమ్మ ఇళ్లే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఉంటే ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు

ప్రజాపక్షం/పిట్లం: పిట్లం మండలంలో ఎలాంటి అనుమతులు పొందకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు పిట్లం ఎస్సై టి.వెంకట్ రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కారేగాం గ్రామ శివారులోని కాకివాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మండలంలో ఏ ప్రాంతం నుండైనా అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లు గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఆయన ప్రజలకు సూచించారు.

## హక్కులు తెలుసుకుని ధైర్యంగా ఉండాలి



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :విద్యార్థినులు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ఉండాలని షీ టీం ఇన్చార్జి అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ సునీత అన్నారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి కాంతిలాల్ పాటిల్, ఎఎస్‌పి చిత్తరంజన్ ఆదేశాల మేరకు సోమవారం కాగజ్‌నగర్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యాలయాలలో మహిళల భద్రతపై షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీం ఇన్చార్జి సునీత విద్యార్థినులకు భద్రతా చట్టాలు, ఆపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైమ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు ఎవరైనా వేధింపులకు గురైనట్లయితే వెంటనే కాగజనగర్ షీ టీం 8712670565 నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అనంతరం హిందూ టవర్ పింకీస్ ఫౌండేషన్ నారీ సమ్మాన్ ప్రాజెక్ట్ డిస్ట్రిక్ వెల్ఫేర్ ఆఫీసర్ (డిడబ్ల్యూఓ) ఆధ్వర్యంలో పిఎం శ్రీ జెడ్‌పిఎస్ఎస్ పెంచికల్పేట్ పాఠశాలలో అమ్మాయిలకు నెలసరి రుతుక్రమంలో వచ్చు సమస్యలు, జాగ్రత్తలు, పరిశుభ్రత పట్ల విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. యాదగిరి, ఉపాధ్యాయులు గంగాభవాని, లక్ష్మీ, భాగ్యశ్రీ, నాగరాణి, ఉజ్వల, శీలా, షీ టీం సభ్యులు బి. రమాదేవి, శ్రీనివాస్, స్వప్న, రుతుక్రమం అవగాహన వేత్త నిరంజన, పరమేశ్వర్ పాల్గొన్నారు.

## బొగ్గు ఉత్పత్తి పెంపుపై దృష్టి సారించాలి



ప్రజాపక్షం/మందమర్రి: బొగ్గు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే దిశగా అధికారులు కృషి చేయాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్) డైరెక్టర్ (ప్లానింగ్ ప్రాజెక్ట్స్) కె. వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం కెకె ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టును సందర్శించిన డైరెక్టర్ పిఒబి ప్లాంట్ వ్యూ పాయింట్‌లను పరిశీలించి మైనింగ్ కార్యకలాపాలను సమీక్షించారు. ప్రాజెక్ట్ ప్రగతి, మైనింగ్ కార్యకలాపాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృషి పట్టుదల ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని, ఉద్యోగులు కార్మికులు విజయాన్ని ప్రేరణగా తీసుకోవాలని అన్నారు. అనంతరం ఎక్స్ప్లైజ్ శాఖలో అసిస్టెంట్ ఎక్స్ప్లైజ్ సూపరింటెండెంట్ పోస్టుకు ఎంపికైన కెకె ఒసిపి కన్వేయర్ ఆపరేటర్ దొమ్మటి రవీందర్ కుమారుడు దొమ్మటి ప్రవీణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, కెకె ఒసిపి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం. మల్లయ్య,ఇంజనీర్ ఎన్. వెంకట మేనేజర్ కె. రామరాజు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు సిజెపై దాడి నిందితులను అరెస్టు చేయాలి



ప్రజాపక్షం /శ్రీరాంపూర్:దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్. గవాయిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, దాడి వెనుక ఉన్న వారిపై పూర్తి విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్చార్జి లింగంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బిఆర్. గవాయిపై జరిగిన దాడిని నిరసిస్తూ ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిళ్ల మల్లేష్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల జెండాలతో భారీ ప్రదర్శన నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత ప్రధాన న్యాయమూర్తిపై దాడి జరగడం అంటే భారతదేశంపై దాడి జరిగినట్టేనని అన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో దేశవ్యాప్త ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జలంపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు చిప్పకుర్తి మల్లేష్, సీనియర్ నాయకులు గద్దల బానేష్, మంతెన మల్లేష్, అంజన్న, మల్లేష్, ఆర్ మల్లేష్, సతీష్, రాయమల్లు, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జి చిప్పకుర్తి సతీష్, సత్యనారాయణ, శ్రీనివాస్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యా బోధనకు కేయాన్ వినియోగించుకోవాలి

ప్రజాపక్షం / కాగజ్ నగర్ :భారత ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ద్వారా అందించబడిన కేయాన్‌ను ఉత్తమ విద్యా బోధన కోసం ఉపాధ్యాయులు తప్పక వినియోగించుకోవాలని మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ అన్నారు. సోమవారం కాగజ్ నగర్ డివిజన్ పరిధిలోని ఎన్నిక చేయబడిన పాఠశాలల్లోని గణితం, సైన్స్ సోషల్ ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులకు కేయాన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసాల ప్రభాకర్ మాట్లాడుతూ ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థులకు అవసరమైన పాఠ్యాంశాలు, వివరణలు, ప్రయోగాలు, వర్క్ షీట్లు కేయాన్ లో ఇన్బి కోరారు. అనంతరం కేయాన్ ద్వారా విద్యా బోధన ఎలా చేయాలో క్వాలిటీ టెక్నాలజీ ఇన్నోవేషన్ ప్రతినిధి నర్సింగ్ దాస్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లా సైన్స్ అధికారి కటుకం మధుకర్ కోఆర్డినేటర్ గా వ్యవహరించారు. ఈశిక్షణలో ప్రధానోపాధ్యాయులు వెంకట రాజం, సునీత, నారాయణ సింగ్, కోడం రవీందర్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా ఉంటాం



ప్రజాపక్షం/కాగజ్ నగర్ : గత శాసనసభ ఎన్నికల్లో ఓటు వేసినా వేయకపోయినా, ఆపదలో ఉన్నామంటూ ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు అండగా నిలుస్తామని మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావు భరోసా ఇచ్చారు. సోమవారం చింతలమానపల్లి మండలం లంబాడి హేట్టి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు కోనేరు కోనప్ప నివాసానికి వచ్చి బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ కండువా కప్పి వారిని పార్టీ లోకి ఆహ్వానించి ఆయన మాట్లాడారు. పార్టీలో చేరిన వారిలో బిజెపి మాజీ ఉపసర్పంచ్ రవి, ధనరాజ్, జటోత్ దేవాజీ, అజ్మీర శంకర్, తిరుపతి, జరుపుల శంకర్, వసంత్, నరసం, భీములు, విలాస్ కుమార్, బాలు, అజ్మీర ప్రవీణ్ కుమార్, గోపి నాయక్, బుందాలు బాలు, ప్రకాష్ తదితరులు ఉన్నారు.

## బొలేరో వాహనం కింద పడి బాలిక మృతి

ప్రజాపక్షం/నిజాంసాగర్: ప్రమాదవశాత్తు బొలేరో వాహనం కింద పడి బాలిక మృతిచెందిన సంఘటన నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మ్యాదరి మధురశ్రీ(03) తండ్రి సత్యనారాయణ తన ఇంటిముందు కాలకృత్యాలకు వెళ్ళగా అదే రోడ్డుపై టీజీ17టీ 2435 నెంబర్ గల బొలేరో వాహనంలో అచ్చంపేట్‌కు చెందిన శ్రీనివాస్ అటు వైపు వస్తుండగా కాలకృత్యాలకు వెళ్ళిన మధురశ్రీ అకస్మాత్తుగా పరిగెత్తుకు వచ్చి బొలేరో కింద పడిపోయింది. దీంతో వాహనం టైరు పాప పై నుండి వ్యళ్లడంతో ఆమెను ఆసుపత్రికి తీసుకువెళ్ళి చికిత్స చేయించి ఇంటికి తీసుకురాగా పూర్తిగా ఆరోగ్యం చెడిపోయి బాలిక మృతిచెందినట్లు మృతురాలి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## తైక్వాండో రాష్ట్ర స్థాయిలో శశివర్ధన్‌కు రజతం

ప్రజాపక్షం/హాజీపూర్: మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కాల్ల లోని రివిలేషన్ పాఠశాల విద్యార్థి నాగుల శశివర్ధన్ ఎస్‌జిఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) అండర్14 విభాగంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో రజత పతకాన్ని సాధించాడు. ఈ నెల 8వ తేదీన లక్షెట్టిపేటలో ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన జోనల్ స్థాయి అండర్14 పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచి, ఆదివారం నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో శశివర్ధన్ ఈ పతకాన్ని గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి శశివర్ధన్, విద్యార్థి తల్లిదండ్రులు సౌందర్య,శ్రీనివాస్, మాస్టర్ జి.అరుణ్ కుమార్‌లను పాఠశాల కరస్పాండెంట్ రాపోలు విష్ణువర్ధన్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ మద్దెల ప్రశాంత్ అభినందించారు.

## మీ సేవ మేనేజర్, ఇన్‌ఛార్జిలపై చర్యలకు వినతి

ప్రజాపక్షం/నస్పూర్: మందమర్రి పాత బస్టాండ్ ఏరియాలోని మీ సేవ కేంద్రం మేనేజర్ ఉపేందర్, ఇన్‌ఛార్జి జనార్ధన్‌లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్‌కు అఖిల పక్ష నాయకులు వినతి పత్రం అందజేశారు. మీ సేవ కేంద్రం సిబ్బంది ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తూ, సమయ పాలన పాటించకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని నాయకులు కలెక్టర్‌కు వివరించారు. మీ సేవ నిర్వాహకులు పనుల నిమిత్తం కేంద్రానికి వస్తున్న విద్యార్థులను, యువకుడినిపై కలెక్టర్ దీపక్ కుమార్ సానుకూలంగాహామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆకారం రమేష్, బండి శంకర్, సతీష్, కత్తి రమేష్, సొత్కు ఉదయ్, సిపెల్లి సాగర్, రాయబారపు కిరణ్, చిప్పకుర్తి శశిధర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్, భవిష్య నిధి వ్యవస్థ పారదర్శకంగా ఉండాలి

ప్రజాపక్షం/మందమ: ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్1 హరి పచౌరి తెలిపారు. సోమవారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సిఎంపిఎఫ్) అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్ఓటు జిఎం విజయ్ ప్రసాద్ అధ్యక్షత వహించగా, సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్1 హరి పచౌరి ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరి పచౌరి మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్త పెన్షన్ స్కీం రివైజ్డ్ పిపిఓ జారీ ప్రక్రియ వేగవంతమవుతోందని ఆయన పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ సమావేశంలో కొత్త పెన్షన్ స్కీం, ప్రావిడెంట్ ఫండ్, సిఎంపిఎఫ్ భవిష్య నిధి వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. మాట్లాడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రత్నం ప్రదీప్ అనంతరం సిఎంపిఎఫ్ అధికారులు రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్స్ (పిపిఓ) పత్రాలను సంబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, ఇన్చార్జి పర్సనల్ మేనేజర్ ఆసిఫ్, రీజినల్ కమిషనర్ 2 కె. గోవర్ధన్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్, రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, జిఎం స్ట్రక్చర్ కమిటీ మెంబర్ సివి. రమణ, యానియన్ నాయకులు లింగయ్య అన్ని గనుల సంక్షేమాధికారులు పాల్గొన్నారు

# గ్రూప్ 2 ఉద్యోగం సాధించిన బుర్ర భువనకు టిఆర్టిఎఫ్ అభినందనలు



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** టిఆర్ టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్ కుమార్తె బుర్ర భువన గ్రూప్ 2 కు ఎంపికై, కోపరేటివ్ అసిస్టెంట్ రిజిస్టర్ గా నియమితులు కాబోతున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ రాష్ట్ర మెంబర్షిప్ కన్వీనర్ సుంకిశీల ప్రభాకర్ రావు జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిన్న గారి నారాయణ, టిఆర్టిఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ కార్యవర్గం బుర్ర భువనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బుర్ర భువన ఒకటి కాదు, రెండు కాదు, ముచ్చటగా మూడు ఉద్యోగాలు గ్రూప్2, గ్రూప్3, గ్రూప్4, లకు ఎంపిక కావడం గర్వకారణం అన్నారు.నిజంగా కుమారి భువనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు అదృష్టవంతులు మరియు అభినందనీయులనీ అన్నారు. ఇదే స్ఫూర్తి, పట్టుదలను కొనసాగిస్తూ సివిల్ సర్వీసెస్ సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ టిఎఫ్ వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోతుగంటి రమేష్, కోల వినయ్ కుమార్, గాజేంగి విష్ణు, మామిడాల రమేష్, సుల్తాన్ రాజు, గోలి రాధకిషన్, గుగులోత్ రమేష్ నాయక్, బూట్ల శ్రీనివాస్, పులి ప్రవీణ్ కుమార్, పేరుక వెంకటేశ్వరరావు, సామల రాములు, ఇప్పకాయల ప్రకాష్, లక్కే లక్ష్మీ రాజం తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ దర్శనాలపై స్పష్టత ఇవ్వండి



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ రాజన్న ఆలయంలో భక్తుల దర్శనాలపై అధికారులు, ప్రభుత్వ పెద్దలు సరైన స్పష్టత ఇవ్వాలని వేములవాడ పట్టణ బిజెపి అధ్యక్షులు రాపల్లి శ్రీధర్ డిమాండ్ చేశారు. ఒకవైపు అలయంలోనే దర్శనాలు ఉంటాయని మరోవైపు, భీమన్న ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని భక్తులను ఇటు, ప్రజలను అటు గందరగోళానికి సృష్టిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదంటూ ఆయన మండిపడ్డారు. దేశంలో ఆలయ పునర్నిర్మాణాలు చేపట్టినప్పుడు ఎక్కడ కూడా భక్తులకు దైవ దర్శనాలు నిలిపి వేయలేదని ఒకసారి వాటిని పరిగణలోకి తీసుకొని రాజన్న దర్శనానికి ప్రత్యేక సమయాన్ని కేటాయించాలని అయన సూచించారు. ఒకవేళ రాజన్న గర్భగుడిలో దైవ దర్శనాలు నిలిపివేస్తే కేంద్రమంత్రి బండి సంజయ్ సారథ్యంలో వేలాది మంది హిందూ సోదరులతో కలిసి పంచలు కట్టుకొని రాజన్న ఆలయ గుడి తలుపులు తెరిచి దైవ దర్శనాన్ని కల్పిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పట్టణ బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శలో కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/ముత్తారం:** ముత్తారం మండలం లోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన బైరి రాజమల్లు ఇటీవలే మరణించగా వారి దశదిన కార్యక్రమంలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించిన అడవి శ్రీరాంపూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులుతాండ్ర మల్లేష్ ,బందేల రాములు మల్లేష్ అకోజ్ అశోక్, మూగ రవి,నంసాని సదయ్య, బైరీ రాజు,తుమ్మల సది, మరుపాక మధుకర్, సదా స్వామి, సల్పాల తరుపతి,అల్లముల గట్టుయ్య,బైరీ రాజాకోమురు,కేతిరి అంజి తోపాటు సంపత్ పాల్గొన్నారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేసేందుకే ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 27 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వ వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని అన్నారు.

## 16న జాబ్ మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** జల్లా లోని నిరుద్యోగ యువకులకు అపోలో ఫార్మసీ సంస్థ, హైదరాబాద్ లో ఉద్యోగాలు కల్పించుటకు అక్టోబర్ 16న గురువారం రోజున రూమ్ నెంబర్ 225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో గల జిల్లా ఉపాధి కార్యాలయం లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.అపోలో ఫార్మసీ సంస్థ, హైదరాబాద్ లో ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్ , రిటైల్ ట్రైన్ మొత్తం 50 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్ పోస్టులకు బీ ఫార్మసీ లేదా ఫార్మసీ డిప్లమా చేసినవారు, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైన్ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వీరి వయస్సు 1835 లోపు ఉండాలని, తెలిపారు.ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 16న ఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో Room No. 225 నూతన కలెక్టర్ భవన సముదాయంలో, పెద్దకాల్వల పెద్దపల్లి మొదటి అంతస్థులో వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8247656356, 7207917714, 8985336947, 8121262441 ఫోన్ నెంబర్ లో నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## జిల్లెల్లలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం /తంగళ్ళపల్లి :** తంగళ్ళపల్లి మండలం నేరేళ్ల ప్యాక్స్ పరిధిలోని జిల్లెళ్ళ, నేరళ్ల,చిన్న లింగాపూర్ గ్రామాల్లోని వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్యాక్స్ ఛైర్మెన్ కోడూరి భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేస్తామని వెల్లడించారు.నేరెళ్ల ప్రాథమిక వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే వరి కొనుగోలు కేంద్రంలో రైతుల నుండి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చైర్మన్ భాస్కర్ గౌడ్ వెల్లడించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఏవైనా ఇబ్బందులు కలిగితే తమ దృష్టికి తీసుకువస్తే ఎలాంటి ఇబ్బంది లేకుండా చూస్తామని తెలిపారు. గత సంవత్సరం లాగే రైతులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్స్ అనిల్ రెడ్డి, రాజిరెడ్డి, గణేష్ గౌడ్, రవీందర్ రావు, నారాయణ గౌడ్, పొన్నాల కిషన్, ఏ ఎం సి డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లింగారెడ్డి, రవి, శ్రీనివాస్ గౌడ్, శోభా, ప్యాక్స్ సిబ్బంది రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థికి ఘన సన్మానం



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న సారా రూత్విక్ అనే విద్యార్థిని ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మెరుగైన ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికలొ వాలీబాల్ పోటీలకు ఎంపిక కాగా సోమవారం పాఠశాల ఆవరణలో పలువురు ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన రుత్విక్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల ప్రజా ప్రతినిధులు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించి భవిష్యత్తులో క్రీడల్లో మరింతగా రాణించి మండలానికి గ్రామానికి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రుత్విక్ క్రీడల్లో రాణించాలని తన వంతు సహాయంగా బిజెపి మండల శాఖ అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి 2000 రూపాయల ఆర్థిక సహాయాన్ని రుత్విక్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి లో సంధి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఏలాల జలపతి రెడ్డి, వివిధ పార్టీల నాయకులు ముద్దం శరత్, ఎర్ర లక్ష్మి , లవంగ శివ, సిరిపురం రవీందర్, రాజేష్ ,బండి స్వామి, చెట్లపల్లి రమేష్, తదితరులు ఉన్నారు.

## రాజన్న ఆలయం రాజకీయ వేదిక కాదు



**ప్రజాపక్షం/వేములవాడ :** వేములవాడ రాజన్న ఆలయాన్ని రాజకీయాలకు వేదికగా మార్చవద్దని పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. ఆలయ అభివృద్ధి పనుల నేపథ్యంలో నిన్న బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను తగలబెట్టడాన్ని కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ నేపథ్యంలోనే, ఆలయ అభివృద్ధికి మద్దతు తెలుపుతూ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాజన్న ఆలయం ముందు ప్రభుత్వ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ఆలయాన్ని అభివృద్ధి చేయడంలో తప్పేం ఉంది? అని ప్రశ్నించారు. భక్తులకు తాత్కాలికంగా ఇబ్బందులు ఎదురవుతున్నా, అభివృద్ధి పనులు నిలిపే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక కేంద్రమైన రాజన్న ఆలయంపై రాజకీయం చేయడాన్ని మానుకోవాలని బీజేపీ నాయకులకు సూచించారు. రాజన్న ఆలయ అభివృద్ధి అంశంపై రాజకీయ పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో, ఈ పాలాభిషేకం కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు మోడిలస్ పాఠశాల విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట పట్టణ కేంద్రంలోని మోడిలస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వయించిన ఉమ్మడి జిల్లా స్థాయి పుట్‌బాల్ పోటీలలో మోడిలస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్ 14 బాలికల విభాగంలో శ్రీరామ్ శ్రీచైత్ర,అండర్ 17 బాలుర విభాగంలో చీకోటి నాగ వర్షిత్‌లు అద్భుతమైన ప్రదర్శనతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి,అల్లాబక్షు,అశోక్,ఉపాధ్యాయులు,విద్యార్థులు అభినందించారు.